క్లుప్తంగా

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



సూర్యదేవాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యదేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఉచిత అన్నదాన ప్రసాదం అందజేశారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహావిష్కరణ



వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య రామాలయంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహావిష్కరణ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ద్వారకా తిరుమల ట్రస్ట్‌బోర్డ్ సభ్యురాలు నాశం సుజాత, భర్త రోశయ్య దంపతులు విగ్రహావిష్కరణ చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో 108 కలశాలతో ఊరేగించారు. రామాలయంలో విగ్రహావిష్కరణ అనంతరం కుంకుమ పూజ జరిపారు. సాయంత్రం భజన, కోలాటం నిర్వహించారు.

22 నుంచి వలంటీర్లకు వందనం

అనపర్తి: మండలంలో ఈ నెల 22 నుంచి వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నారు. మండల పరిధిలో 415 మంది సేవా మిత్ర, ఐదుగురు సేవా రత్న పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ నెల 22న లక్ష్మీనరసాపురం, 23న పీరారామచంద్రపురం, 24న దుప్పలపూడి, కొప్పవరం, 25న మహేంద్రవాడ, 26న పొలమూరు, 27న రామవరం, 29న పులుగుర్త, పెడపర్తి, 31న కుతుకులూరు గ్రామాల పరిధిలో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద పురస్కారాలకు ఎంపికైన వలంటీర్ల సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీఎల్ నరసింహం తెలిపారు.

మజ్జిగ పంపిణీ అభినందనీయం



మర్రిపూడిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సంఘం సభ్యులు

రంగంపేట: వేసవిలో పాదచారులు, వాహనదారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయని సర్పంచ్ వేము మాధవి అన్నారు. మర్రిపూడిలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ఉప సర్పంచ్ మేడిది చక్రం ఆధ్వర్యంలో మేడిది వెంకటరమణ మెమోరియల్ సేవా సంఘం తరఫున మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో మేడిది వారి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ వేము చిరంజీవి పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం



రంగంపేటలో కొత్త డీటీఆర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట సాయిబాబా గుడి ఏరియాలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు సంవత్సరాలుగా లోఓల్టేజీ సమస్యతో విసిగిపోయినట్టు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేయడంతో స్థానిక విద్యుత్ ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు తన సిబ్బందితో కలిసి కొత్త డీటీఆర్ ఏర్పాటుచేసి సుమారు 400 మీటర్ల కొత్త కేబుల్ వేసి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

గోకవరం: మల్లవరం గ్రామంలో ఉమామల్లేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు అనంతరం ఉమా మల్లేశ్వరస్వామి, గణపతి, నందీశ్వరుడు, నవగ్రహాలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

చిరు వ్యాపారులకు ఎండ దెబ్బ

- జన సంచారం లేక వెలవెల
- దిగాలు పడుతున్న వ్యాపారులు

రంగంపేట: రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు కూడా బద్దలవుతాయి. అలాంటిది రోహిణి కార్తె ఇంకా రాకుండానే ఎండలు మండుతున్నాయి. నిత్యం 40 నుంచి 44 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రోజురోజుకి పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఉదయం 9 గంటలు దాటిందంటే ప్రజలు బయటకు అడుగు పెట్టాలంటేనే భయపడిపోతున్నారు. దీంతో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజలు ఇళ్లకే పరిమితమైపోతుండడంతో వ్యాపారాలు బాగా మందగించాయని ఆందోళన చెందుతున్నారు.

రాజానగరం నుంచి పెద్దాపురం వరకూ ఏడీబీ రోడ్డు వెంబడి వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, రామేశంపేట తదితర ప్రాంతాల్లో పలు గ్రామాలకు చెందిన చిరు వ్యాపారులు సీజనల్‌గా దొరికే పలు రకాల పండ్ల అమ్మకాలు చేస్తున్నారు. ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించడంతో వీరందరి వ్యాపారానికి నీడ కరవైంది. ఎండలకు జన సంచారం తగ్గి వ్యాపారం పూర్తిగా మందగించడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పండ్లు వెంటనే పాడైపోతుండడంతో నిన్నమొన్నటి వరకూ కొండెక్కి కూర్చున్న పండ్ల ధరలు కాస్త దిగొచ్చాయి. సాయంత్రం 5 గంటలు దాటాకే జనం బయటకు వస్తున్నారని అప్పుడు కాస్తంత వ్యాపారం జరుగుతుందని అంటున్నారు. ఆదాయం సగానికి పడిపోయి కష్టంగా మారిందని చెబుతున్నారు.



పెదరాయవరం వద్ద ఏడీబీ రోడ్డు పక్కన ఎండలో కస్టమర్ల కోసం ఎదురుచూస్తున్న చిరు వ్యాపారి

అధిక ఎండలతో తగ్గిన వ్యాపారం



అధిక ఉష్ణోగ్రతలు కారణంగా జనాల రాక తగ్గి వ్యాపారం బాగా మందగించింది. ఉదయం పది గంటలు దాటిన తరువాత ఐదు గంటల వరకూ ఖాళీగానే ఉంటున్నాం. వ్యాపారం తగ్గిపోవడంతో కొందరైతే చార్జింగ్ లైట్‌లు పెట్టుకుని రాత్రి 10 గంటల వరకూ ఉంటున్నారు.

– ప్రగడ నాగేశ్వరరావు, పండ్ల వ్యాపారి, రంగంపేట

ఎండలు తగ్గే వరకూ కష్టాలే



ఎండలు తగ్గే వరకూ చిరు వ్యాపారులకు కష్టాలు తప్పేలా లేవు. ఎండ వేడికి జనాలు రాక వ్యాపారాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. మధ్యాహ్న సమయంలో ఖాళీగా ఎదురుచూస్తున్నాం. ఉదయం, సాయంకాలం వేళల్లో కొద్దోగొప్పో వ్యాపారం సాగుతుంది.

– పి.దుర్గాప్రసాద్, పండ్ల వ్యాపారి, వెంకటాపురం

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రాక



విమానాశ్రయంలో వైవీ సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

మధురపూడి: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయన హైదరాబాద్ నుంచి ఇండిగో సర్వీసులో ఇక్కడికి వచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన ఆయనకు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, హౌసింగ్ బోర్డు చైర్మన్ దవులూరి సుబ్బారావు తదితరులు స్వాగతం పలికారు. ఆయన విమానాశ్రయం నుంచి కాన్వాయ్‌లో రాజమహేంద్రవరం వెళ్లారు.

గ్రామదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

అనపర్తి: మండలంలోని కుతుకులూరు గ్రామ దేవత అనపాలమ్మను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనపాలమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారి ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు గరగను శిరస్సుపై ఎత్తుకుని జాతరకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరిసాయి కృష్ణారెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పులగం వీరవెంకట సత్యనారాయణరెడ్డి, కొవ్వూరి మురళీవెంకటకృష్ణారెడ్డి, కొవ్వూరి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జి.మామిడాడలో...

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని సీకులమ్మ వారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. గ్రామంలో అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారంపూడి పద్మరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అనపాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అందరికీ పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలందరికీ పూర్తి స్థాయిలో తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో రూ.11 లక్షలతో నూతనంగా నిర్మించిన తాగునీరు బోర్‌వెల్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి ఎండల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. పెదపూడిలో అదనంగా బోర్‌వెల్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి దాని నుంచి నీటిని సమగ్ర రక్షిత తాగునీరు సరఫర ట్యాంక్‌లలోకి ఎక్కించి అనంతరం ప్రజలకు సరఫరా చేస్తున్నారన్నారు. మండలంలోని గ్రామాల్లో సుమారు రూ.15 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో తాగునీటికి సంబంధించి పైపులైన్ల ఆధునికీకరణ, నూతన వాటర్ ట్యాంకల నిర్మాణం, ఇంటింటికీ కుళాయి తదితర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, వైఎస్సార్‌సీపీ మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాకర సాయిబాబు, కోరా వీర్రాజు చౌదరి, పార్టీ గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పెదపూడిలో బోర్‌వెల్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

రాజానగరం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇందులో భాగంగా స్థానిక అగ్రహారంలో నూతనంగా ఏర్పాటు చేసిన 65 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. దీనిద్వారా లోఓల్టేజ్ సమస్య పరిష్కారమవ్వడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. మండలంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాధేయపాలెంలో రూ.2.8 కోట్లు, వెలుగుబంద జగనన్న కాలనీలో రూ.5 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలను నిర్మిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, వార్డు సభ్యులు ప్రగడ చక్రి, ఉప్పు అబ్బులు, అనంతలక్ష్మి, ఆర్.వీరబాబు, వెంకటస్వామి పాల్గొన్నారు.



రాజానగరం అగ్రహారంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి

సీతానగరం: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిల శేషగిరి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. రఘుదేవపురంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేషగిరి మాట్లాడుతూ ఆనాడు రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన టెలికం, సాంకేతిక విప్లవంతోనే నేడు దేశం టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పరుగులు పెడుతోందన్నారు. అనంతరం పేదలకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దూలం కిషోర్, మండల నాయకులు మట్ట రాము, మామిడి మంగరాజు, పిర్ల సురేష్, ఊడి వెంకటరత్నం, దూలం అరుణ్ తేజ పాల్గొన్నారు.

సూర్యారావు పేటలో..

రాజానగరం: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సూర్యారావుపేటలోని ఆయన విగ్రహానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు వడయార్, జిల్లా కమిటీ సభ్యుడు మార్టిన్ లూథర్, మండల కమిటీ అధ్యక్షుడు ముప్పిడి శ్రీను పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్యావరణ హితంగా జీవనశైలి

రాజానగరం: పర్యావరణం బాగుంటేనే మనమందరం బాగుంటామని, పర్యావరణానికి హాని కలిగించని విధంగా మన జీవనశైలిని మార్చుకోవాలని అటవీశాఖ బీట్ అధికారి జీవీ రంగారావు అన్నారు. పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకువస్తూ మిషన్ లైఫ్ ఎన్విరాన్‌మెంట్ అనే కార్యక్రమాన్ని దివాన్‌చెరువులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, ప్లాస్టిక్ సంచులు, కవర్ల నిషేధం బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం కూడా బాగుంటుందని ప్రచారం చేశారు. యువతతో పర్యావరణ పరిరక్షణ మా బాధ్యతంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అసిస్టెంట్ బీట్ అధికారి శివప్రసాద్‌రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్ర సహాయకుడు సుబ్బారావు పాల్గొన్నారు .



దివాన్‌చెరువులో పర్యావరణ చైతన్య ర్యాలీ

పేదల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

మధురపూడి: బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సమీపంలోని గోడి గ్రామంలో ఆయనను ఆదివారం మాదిగ ఐక్యవేదిక కోరుకొండ శాఖ నాయకులు కలిశారు. ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పనిచేస్తున్నారన్నారు. దళితుల హక్కుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నారన్నారు.



గోడిలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక

రంగంపేట: జి.దొంతమూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందన వీర్రాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గ్రామంలో పర్యటించి తల్లిదండ్రులను కలసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని విద్యార్థులకు ఉత్తమ బోధన చేస్తారని వివరిస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక ద్వారా యూనిఫాం, బ్యాగులు, బూట్లు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే పిల్లలకు వెంటనే అడ్మిషన్ ఇస్తున్నారు.



జి.దొంతమూరులో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

నేటి నుంచి విద్యార్థులకు శిక్షణ

మధురపూడి: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకూ అటల్ టింకరింగ్ లాబ్ సమ్మర్ బూట్ క్యాంపులు నిర్వహిస్తోంది. దానిలో భాగంగా కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక నైపుణ్య అభివృద్ధి తరగతులు నిర్వహిస్తామని హెచ్‌ఎం రామన్న దొర తెలిపారు. 6 నుంచి 9 వతరగతి వరకూ విద్యార్థుల్లో ఎంపిక కాబడిన 25 మందికి శిక్షణ ఇస్తారన్నారు. ఢిల్లీకి చెందిన అటల్ ఇన్నోవేషన్ మిషన్, పునెకి చెందిన విజ్ఞాశ్రం, ఆంధ్రప్రదేశ్ యునిసెఫ్, సమగ్ర శిక్ష అభియాన్ సహాయ సహకారాలతో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు దీనిని నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రానిక్స్, 3 డీ ప్రింటింగ్ డిజైనింగ్, వీడియో మేకింగ్, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వంటి కృత్యాలలో తర్ఫీదు ఇస్తారు. నాలుగు రోజులు పాటు జరిగే ఈ తరగతులు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ జరుగుతాయి.

కూ.. చకచకా..

- చురుగ్గా రైల్వేకోచ్ రెస్టారెంట్ పనులు
- జూన్‌లో ప్రారంభోత్సవానికి చర్యలు
- 24 గంటలూ అందుబాటులో ఆహార పదార్థాలు

రాజమహేంద్రవరం సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికులను ఆకట్టుకునేందుకు రైల్వేశాఖ వినూత్న ప్రయోగాలు చేస్తోంది. అందులో భాగంగా రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో 24 గంటలూ ఆహార పదార్థాలను అందించేందుకు రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను సిద్ధం చేస్తోంది. సుమారు 25 ఏళ్ల పాటు ప్రయాణికులకు సేవలందించిన తర్వాత తీసివేసిన ఏసీ కోచ్‌లను ఈ విధంగా రెస్టారెంట్‌గా తీర్చిదిద్దుతోంది. త్రీస్టార్ రేంజ్‌లో వీటిని సిద్ధం చేస్తున్నారు.

అన్నిరకాల పదార్థాలు

రాజమహేంద్రవరంలో రాత్రి 12 గంటలు దాటితే ఎక్కడా ఆహారం దొరికే పరిస్థితి లేదు. ఈ రైల్వే కోచ్ రెస్టారెంట్ ప్రారంభమైతే 24 గంటలూ ప్రయాణికులకు, ప్రజలకు ఆహారం అందుబాటులో ఉంటుంది. ఇక్కడ కాఫీ, టిఫిన్, భోజనంతో పాటు వెజ్, నాన్‌వెజ్ నూడిల్స్, బిర్యానీ, ఫ్రైడ్ రైస్, సౌత్, నార్త్ ఇండియన్, చైనీస్, కాంటినెంటల్ వంటకాలు లభిస్తాయి. ఈ ఆహారాన్ని లైవ్‌లో తయారు చేసి అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు 36 మంది కూర్చునే సదుపాయం కలిగిన ఈ కోచ్ రెస్టారెంట్‌ను పుట్టినరోజు పార్టీలకు ఇవ్వనున్నట్లు సమాచారం.

అధునాతనంగా..

రెస్టారెంట్ లోపల ఆధునాతన కుషన్ సీట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వే కోచ్‌లో ప్రయాణిస్తూ అనుభూతి పొందాలనుకునే వారికి ఈ రెస్టారెంట్ కొత్త అనుభవాన్ని అందించనుంది. ఈ కోచ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ఈ రెస్టారెంట్ ఏరియాను గ్రీనరీతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే విభాగంలో మొదటగా గుంటూరులో ఏర్పాటు చేశారు. విజయవాడ డివిజన్‌లో విజయవాడ, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లలో సిద్ధమవుతున్నాయి.



కోచ్ లోపలి భాగం



శరవేగంగా సిద్ధమవుతున్న రైల్వేకోచ్ రెస్టారెంట్

అందుబాటులో ఆహారం



రైల్వేకోచ్ రెస్టారెంట్‌లో 24 గంటలూ కోరుకున్న ఆహారం దొరుకుతుంది. త్వరలో ప్రారంభం కానున్న ఈ రెస్టారెంట్ నగర ప్రజలతో పాటు జిల్లా ప్రజలను ఆకట్టుకుంటుంది. రాత్రి 12 గంటలు దాటితే నగరంలో ఆహారం దొరకని పరిస్థితి. రైల్వే కోచ్ రెస్టారెంట్‌తో ఆ బాధలు తీరనున్నాయి.

– సీరపు నాగకృష్ణ మోహన్‌రెడ్డి

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనపర్తి: స్థానిక దేవీ చౌక్ సెంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఏఎస్ఐ టి.వీర్రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయసు 40–45 సంవత్సరాల మధ్య ఉంటుంది. వడదెబ్బ కారణంగా మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు అనపర్తి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మేకల దొంగతనంపై కేసు

గోకవరం: తిరుమలాయపాలెంలో జరిగిన మేకల దొంగతనంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదయ్యింది. ఏఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొట్టుకుల చంటమ్మ మేకలు పెంచుతూ జీవిస్తోంది. ఈనెల 18న రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి ఏడు మేకలను అపహరించారు. అలాగే ఆదివారం మరో నాలుగు మేకలను కారులో వేసుకుని ఎత్తుకుపోయారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

బిక్కవోలు: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందినట్టు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం బిక్కవోలు గ్రామ శివారులో టేకుమూడి సత్యనారాయణకు చెందిన రొయ్యల చెరువు వద్ద పనిచేస్తున్న రుషియా బదారేట్(16) ఆదివారం ఉదయం చెరువులోని నీరు బయటకు తోడటానికి మోటారు ఆన్‌చేయగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పుస్తక పఠనం, నీతికథలు చెప్పడం, హ్యాండ్‌క్రాఫ్ట్, చదరంగం, తెలుగు పద్యాలు, లలిత సంగీతం తదితర శిక్షణ తరగతులు నిర్వహించారు.